క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

రుద్రంగి: స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రుద్రంగి మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతపై రుద్రంగి సర్పంచ్, గ్రామ అధికారులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి వినియోగించాలని, ఆరుబయట మల, మూత్ర విసర్జన చేయకూడదని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సీఏలు, తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో నిరసన



వంటావార్పులో పంచాయతీ కార్మికులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ ఎదుట కార్మికులు సోమవారం వంట వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. రోడ్డుపై వంటలు చేసి నిరసన తెలిపారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన పంచాయతీ కార్మికులు కలిసి రోడ్డుపైనే భోజనాలు చేశారు.

రిలే నిరాహార దీక్ష విరమణ



దీక్షలు విరమింప చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండల కేంద్రంలోని దోసల గూడెంలో అంబేద్కర్ భవన నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ సంఘ సభ్యులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం ముగిశాయి. బీఆర్‌ఎస్ నాయకులు రెడ్డిమల్ల రాజనర్సు, వికాస్‌బాబు, దోసల రాజు, శంకర్, అభిలాష్, బాలకృష్ణ సంఘ సభ్యులతో మాట్లాడారు. పనులు త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంఘ సభ్యులు దీక్షలను విరమించారు.

అప్‌గ్రేడ్ కలేనా?

- సామాన్యులకు అందని సర్కార్ వైద్యం
- స్థలం దొరకడమే అసలు సమస్య
- మంత్రి కేటీఆర్‌పైనే ఆశలు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోనే మారుమూల గిరిజన మండలమైన ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఉమ్మడి మండలాల గిరిజన పేద ప్రజలకు ఖరీదైన సర్కార్ వైద్యం అందించేందుకు స్థానికంగా ఏర్పాటు చేస్తామన్న 30 పడకల ఆసుపత్రి కలగానే మారింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మారుస్తామని నాలుగేళ్ల క్రితం ఇచ్చిన హామీలు కాగితాలకు పరిమితమయ్యాయి. ప్రభుత్వ వైద్యం అందక సామాన్యులు కార్పొరేట్ స్థాయిలో ప్రైవేట్ చికిత్సలు చేయించుకోలేక అనారోగ్యంతో విలవిల్లాడుతున్నారు.

మండలంలోని బండలింగంపల్లిలో, వీర్నపల్లిలో ఏర్పాటు చేస్తామన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటులో అంతులేని జాప్యం జరుగుతోంది. ఫలితంగా ప్రజలు సర్కార్ వైద్యం పొందేందుకు సిరిసిల్ల, కరీంనగర్, హైదారాబాద్, కామారెడ్డి లాంటి ప్రాంతాలకు అనేక వ్యయప్రయాసాల కోర్చి ప్రాణాలు దక్కించుకుంటున్నారు. ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలాగా మారిందని ఉమ్మడి మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నాలుగేళ్లుగా ఎదురుచూపులే..

ఎల్లారెడ్డిపేటలో నాలుగేళ్ల క్రితం ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పలుమార్లు ఏర్పాటుపై పరిశీలనలు చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుకు స్థలం సరిపోవడం లేదు. దీంతో మండల కేంద్ర శివారులో సర్కార్ స్థలం కోసం అధికారులు గాలించారు. 30 పడకల ఆసుపత్రి భవన సముదాయానికి సుమారు 3 ఎకరాల స్థలం అవసరం ఉంటుందని అధికారులు అంచనాలు వేశారు. అంతా పెద్ద మొత్తంలో అనువైన స్థలం దొరకని కారణంగా ఏర్పాటులో జాప్యం జరుగుతుందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులంటున్నారు. ఇటీవల గ్రామ శివారులోని పాల కేంద్రం వద్ద ఒక స్థలాన్ని ఎంపిక చేసి దాని కోసం పరిశీలనలు చేస్తున్నారు. ఇది కూడా ఒక కొలిక్కి రాలేదు. దీంతో ఏర్పాటులో మరింత జాప్యం జరిగే అవకాశాలున్నాయి. అటు స్థల సమస్య, ఇటు అధికారుల ఉదాసీనత ప్రజలకు శాపంగా మారుతోంది.

మంత్రి కేటీఆర్‌పైనే ఆశలు

ఎల్లారెడ్డిపేటలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు విషయంలో ప్రజలు మంత్రి కేటీఆర్‌పైనే ఆశతో ఉన్నారు. ఈ ప్రాంత నిరుపేద ప్రజలు వైద్యపరంగా పడుతున్న ఇబ్బందులపై మంత్రికి అవగాహన ఉంది. ఆపద సమయంలో ఎంతోమందికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ఆయన కృషి చేస్తున్నారు. దీంతో పాటు సిరిసిల్ల ఏరియాసుపత్రిని అన్ని హంగులతో తీర్చిదిద్దారు. ఈ క్రమంలో స్థానికంగా 30 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందనే ఆశతో ప్రజలున్నారు. ఆసుపత్రి ఏర్పాటు చేసి నిరుపేదలకు ప్రభుత్వపరంగా ఖరీదైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని సేవలు అందుబాటులోకి..



పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మార్చితే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. అన్ని విభాగాల వైద్యులు సేవలందించేందుకు అందుబాటులోకి వస్తారు. ఆసుపత్రి అప్‌గ్రేడ్ చేస్తే ప్రైవేట్‌పరంగా ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గుతాయి. మెరుగైన వైద్యంతో ఎన్నో ప్రాణాలు నిలబడుతాయి. మంత్రి కేటీఆర్ దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

– నిమ్మ నారాయణరెడ్డి, నారాయణపూర్

స్థల సేకరణ జరుగుతోంది



ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు స్థలం సరిపోవడం లేదు. స్థల సేకరణ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థలం దొరకగానే ఏర్పాటు పనులు చేపట్టే అవకాశాలున్నాయి. 30 పడకలు అందుబాటులోకి వస్తే ప్రత్యేక వైద్యులు వస్తారు. అప్పుడు వివిధ రకాల సేవలు అందుతాయి. ఆ దిశగా వైద్యశాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారు.

– బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఎల్లారెడ్డిపేట

నమాచారం

నేడు సామాజిక తనిఖీపై సమీక్ష

వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 10 గంటలకు ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన సామాజిక తనిఖీపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 17 గ్రామాల్లో జరిగిన గ్రామసభలో చర్చించిన అంశాలపై, జరిగిన పనులపై పబ్లిక్ హియరింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నియామకం

చిత్రకారుల రాష్ట్ర సంక్షేమ సంఘం కోశాధికారిగా మధు

చందుర్తి: తెలంగాణ పెయింటింగ్ చిత్రకారుల రాష్ట్ర సంక్షేమ సంఘం కోశాధికారిగా చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఇందూరి మధును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైనా ఇందూరి మధును చందుర్తి జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరింతగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్రకారులు పోతుగంటి వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘అసత్య ప్రచారాలు నమ్మొద్దు’



సబ్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

తంగళ్లపల్లి: మంత్రి కేటీఆర్ అబద్ధాలతో రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆరోపించారు. సోమవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సందర్శించి లాగ్ బుక్కులు పరిశీలించి, 24 గంటల విద్యుత్ ఎప్పటి నుంచి వస్తుందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 గంటల కరెంటు నాలుగు రోజుల నుంచే ఇస్తున్నారని ఇన్ని రోజులు ప్రజలకు అబద్ధాలు చెప్పి అసత్య ప్రచారాలు చేసి మోసం చేశారని ఆరోపించారు. లాగ్ బుక్ పరిశీలిస్తే రైతులకు 7 గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నట్లు తెలిసిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, లింగాల భూపతి, మచ్చ శ్రీనివాస్, గుగ్గిళ్ల శ్రీకాంత్, అరెపల్లి బాలు, గుగ్గిళ్ల భరత్, ఎడ్ల తిరుపతి, శ్యామ్, శ్రీనివాస్, సలీమ్, ఖురేషి, మజీద్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



ఎల్లారెడ్డిపేట: చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. 12 మంది లబ్ధిదారులకు రూ.4 లక్షల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, ఎలగందుల అనసూయ, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారుడు జేరి ఆంజనేయులు ఉపాధి నిమిత్తం వేరే ప్రాంతానికి తరలివెళ్లగా అతడిని వెతుక్కుంటూ వెళ్లి రూ.60 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం అందజేశారు. ఆంజనేయులుకు రూ.60 వేలు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు అవ్వగా అతడు అందుబాటులో లేకపోవడంతో ఆచూకీ తీసుకుని మల్యాల గ్రామానికి వెళ్లి స్వయంగా చెక్కును అందజేయడంతో హర్షం వ్యక్తం చేశాడు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ధన్యవాదాలు తెలిపాడు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పడిగెల రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పాత్తూరు గ్రామానికి చెందిన ఒట్టి కొంరయ్య రూ.12 వేలు, ర్యాగటి అంజయ్య రూ.14 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం బాధితులకు సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అశ్విని, ఉపసర్పంచ్ పర్శరాం, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే కటిక చీకటి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి: కాంగ్రెస్ అంటేనే కటిక చీకటి పార్టీగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అభివర్ణించారు. బోయినపల్లి రైతువేదిక భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తే రైతుల ఎదుగుదల చూసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓర్వలేక 24 గంటల విద్యుత్ అవసరం లేదని వాగుతున్నాడన్నారు. రైతులకు మొదటి శత్రువు కాంగ్రెస్ అని, దేశంలో వ్యవసాయ రంగాన్ని నాశనం చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఆ పార్టీని రైతులు నమ్మవద్దని కోరారు. ఉచిత విద్యుత్ వద్దని రైతులను ముంచే పార్టీల నుంచి దూరంగా ఉండాలన్నారు. రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు కొనుకటి లచ్చిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

చిత్రకథ



ఎక్కడి చెత్త అక్కడే..

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ప్రధాన వీధులే కాదు సందులు, గల్లీలు చెత్త కుప్పలతో కంపు కొడుతున్నాయి. పంచాయతీ కార్మికుల సమ్మెతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోజు ఉదయం ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు చెత్తను ఇచ్చిన ప్రజలు. ఇప్పుడు వీధుల్లోనే చెత్తను పారవేస్తున్నారు. ఇక ముస్తాబాద్‌లోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలు, హోటళ్లు అదే పద్ధతిలో రోడ్డుపైనే చెత్తను పారవేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. దుర్వాసన, ఈగలు, దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

‘అక్రమాలపై మాట్లాడితే ఉలికిపాటు ఎందుకు?’

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తే బీఆర్‌ఎస్ నాయకులు ఉలికిపడుతున్నారని బీజేపీ పట్టణ కార్యదర్శి సిరస్వాల్ కిలాస్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలోని అధికారులు, కొందరు పాలకవర్గం సభ్యులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ప్రశ్నిస్తే ఉలికిపాటు ఎందుకని ప్రశ్నించారు. ఎలాంటి అవగాహన లేకుండా బీఆర్‌ఎస్ నాయకులు ఆయనపై ఇష్టానుసారంగా వ్యక్తిగత దూషణలు సరికాదన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. బ్లాక్ మెయిల్ దందా, భూ ఆక్రమ దందాలకు బీఆర్‌ఎస్ నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న శిరస్వాల్ కైలాస్

న్యాయపరంగా ఎదుర్కొంటామని, ఇలాంటి వ్యక్తిగత దూషణలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు పెరుమాండ్ల ప్రవీణ్, కార్యదర్శి కొంపెల్లి రాజేందర్, ఎస్టీ మోరా పట్టణ అధ్యక్షుడు మొగిలిరాజు, లీగల్ సెల్ సభ్యుడు సాయిరాం, తుమ్మ విజయ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

‘హామీలు నెరవేర్చని ప్రభుత్వం’



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో సోమవారం రైతుల సమస్యలతో కూడిన కరపత్రాలను గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.లక్ష రుణమాఫీ కాలేదన్నారు. ఉచితంగా ఎరువులు, విత్తనాలను అందించలేదని, పంట నష్టం జరిగితే ఇప్పటి వరకు పరిహారం అందించలేదన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేస్తామని నెల రోజులు గడిచిన జమ చేయలేదన్నారు. రైతు వేదికలను రాజకీయాల కోసం వాడుకోవడం అన్యాయమన్నారు. ఇలాంటి రైతుల సమస్యలపై పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఈదేశాల మేరకు ఈ కరపత్రాలను పంపిణీ చేశామన్నారు.

పాఠశాలల్లో బోనాలు



సిరిసిల్లటౌన్: వివేకానంద విద్యానికేతన్‌లో..

సిరిసిల్లటౌన్/కోనరావుపేట: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం బోనాల పండుగను నిర్వహించారు. సిరిసిల్లలో వివేకానంద విద్యానికేతన్, కోనరావుపేట మండలం బావుసాయిపేటలోని కేరళ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులు పోతరాజులు, పులి వేషధారణలు, అమ్మవార్ల అవతారాల్లో కనువిందు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపడుతూ బోనాల మహోత్సవాన్ని ఆటపాటలతో ప్రదర్శించడం ఆకట్టుకుంది. కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ బుచ్చారావు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కోనరావుపేట: బావుసాయిపేటలోని కేరళ స్కూల్‌లో..

చెత్త సేకరణలో సర్పంచ్



గంభీరావుపేట: గ్రామపంచాయతీ పారిశుధ కార్మికుల సమ్మెతో గ్రామంలో చెత్త సేకరణ నిలిచిపోయింది. దీంతో చెత్త సేకరించేందుకు సర్పంచులు రంగంలోకి దిగారు. గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ సోమవారం చెత్త సేకరణ పనులు చేపట్టారు. పారిశుధ్య పనులపై సర్పంచ్ శ్రద్ధను పలువురు గ్రామస్తులు అభినందించారు.

పరామర్శ

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన లింగాని ప్రదీప్ అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందగా మృతుడి కుటుంబ సభ్యులను తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పరామర్శించారు.

సంక్షేమపాలన బీఆర్‌ఎస్‌కే సాధ్యం



సిరిసిల్లటౌన్: నియామకపత్రం అందిస్తున్న చక్రపాణి



ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్‌లో..

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/వీర్నపల్లి/గంభీరావుపేట: సిరిసిల్ల పట్టణంలోని 21, 35వ వార్డులో బూత్ కమిటీ నియామక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ కేసీఆర్ కార్యదక్షతతో రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా అభివృద్ధి వేగంగా సాధిస్తుందన్నారు. ఇరు వార్డుల్లో కొత్తగా నియమించిన బూత్ కమిటీలకు నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు దూస వినయ్, వేముల రవి, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనిత, ఏఎంసీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ రమణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు బండి జగన్, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని రంగంపేటలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ లింగం, ప్యాక్స్ వైస్‌చైర్మన్ తాటిలెంక ప్రభాకర్, రాయిని బుగ్గయ్య, సుతారి మల్లయ్య, పంబాల హన్మాండ్లు, పోన్నం దేవరాజు, రాయిని శ్రీనివాస్, ఉస్మాన్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల, లింగన్నపేటలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటస్వామిగౌడ్, రాజారాం, దయాకర్‌రావు, సురేందర్‌రెడ్డి, కొమిరిశెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘దండం పెడతాం.. సహకరించండి’

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ గొర్రె కరుణ, భర్త రంజిత్‌ను సోమవారం పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామంలో చెత్త ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో, సర్పంచ్ భర్త తనే స్వయంగా ట్రాక్టర్ తీసుకోని డంపింగ్ యార్డ్‌కు తరలించే ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డు తగిలి ‘మీకు దండం పెడుతాం.. మాకు సహకరించండి’ అంటూ వేడుకున్నారు. దీంతో సర్పంచ్ భర్త ఏమి చేయలేక ట్రాక్టర్ దిగి వెళ్లిపోయారు.



సర్పంచ్ భర్తను వేడుకుంటున్న కార్మికులు